క్లుప్తంగా

వేగంగా టీచింగ్ ఆస్పత్రి నిర్మాణ పనులు



కొనసాగుతున్న పనులు

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న టీచింగ్ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతుంది. మెడికల్ కళాశాలకు అనుబంధంగా 220 బెడ్ల సామర్థ్యంతో పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనుల కోసం మొదటి విడతలో రూ.27 కోట్లు కేటాయించారు. మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 19లో మెడికల్ కళాశాలను త్వరలో ఏర్పాటు చేయనున్నారని అధికారులు తెలిపారు. మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.124.50 కోట్లు మంజూరు చేసింది. అదే మెడికల్ కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల భవనాలకు రూ.46 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఫిజియోథెరఫి, పారామెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు చేశారు. ఈ భవన నిర్మాణ పనులను సంబంధిత అధికారులు త్వరలో ప్రారంభిస్తారని తెలిపారు.

నైపుణ్యాలు గుర్తించే బాధ్యత తల్లిదండ్రులదే



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

యాలాల: పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలు గుర్తించే బాధ్యత తల్లిదండ్రులదేనని అగ్గనూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మొగులయ్య పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలకు క్రమం తప్పకుండా పంపించాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం వందశాతం హాజరు, ప్రత్యేక ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురహరినాథ్, కవిత, అమరావతి, సంజీవ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ప్రమాణాలు పాటించాలి

ఎంపీడీవో జర్నప్ప



మాట్లాడుతున్న జర్నప్ప

పెద్దేముల్: నీటి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పెద్దేముల్ ఎంపీడీవో జర్నప్ప పేర్కొన్నారు. శనివారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ వాటర్ మెన్‌లకు నీటి సరఫరాపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నీటి సరఫరా కలుషితం కాకుండా సరఫరా చేయాలన్నారు. ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఉంటే వాటిని వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీఓ తరన్‌సింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ ఏఈ హకీల్, ప్రతిభ, మాస్టర్ ట్రైనర్ ఫయాజ్ పాల్గొన్నారు.

సీఐగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



ఎస్పీ నారాయణరెడ్డికి మొక్క అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు: తాండూరు రూరల్ సీఐగా శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారంటూ పలువురు పోలీస్ అధికారులపై బదిలీ వేటు వేశారు. దీంతో తాండూరు రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీకి మొక్క అందజేశారు. అనంతరం అక్కడి నుంచి కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ అశోక్ రిలీవ్ అయ్యి సీఐ శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. అనంతరం డీఎస్పీ బాలకృష్ణారెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

మురుగు.. పరుగు!

- లగచెర్ల డంపింగ్ నుంచి వెదజల్లుతున్న దుర్వాసన
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- రోగాలబారిన జనం
- పట్టించుకోని అధికారులు



లగచెర్లలో రోడ్డుపై చేరిన మురుగు నీరు

దుద్యాల్: అసలే వ్యాధుల కాలం. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా రోగాలు ప్రబలుతున్నాయి. వైద్యంకోసం పేదలు, మధ్యతరగతి కుటుంబాలు రూ. లక్షల్లో ఖర్చు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యం పాలవుతూ నిత్యం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం లోపించడంతో వ్యాధులు ప్రబలే అవకాశమెక్కువ అని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం స్వచ్ఛభారత్, స్వచ్ఛదనం పచ్చదనం, డ్రైడే ఫ్రైడే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమందిలో మార్పురావడం లేదు. ప్రభుత్వ సిబ్బందికూడా నిర్లక్ష్యంగా ఉండడంతో పారిశుద్ధ్యం లోపిస్తుందని గ్రామస్తులు తెలిపారు. అక్కడక్కడ రోడ్లపై మురుగు చేరడమే కాకుండా జనవాసాల మధ్య పారుతుంది. దీంతో తాము వ్యాధుల బారినపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు చేరినప్పుడు మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెప్పినా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మండల పరిధిలోని లగచెర్ల, గౌరారంలో ఇళ్ల మధ్య మురుగు పారుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. లగచెర్ల గ్రామంలో రోడ్డుపై మురుగు పారుతున్నా గ్రామస్థులు, వాహనదారులు అక్కడి నుంచే వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. గౌరారంలో ఆంజనేయ స్వామి దేవాలయం ముందు రోడ్డుపై మురుగు నీరు పారుతుంది. ఇలా ఆయా గ్రామాల్లో కొన్ని రోజులుగా మురుగు పారుతుండడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంలో పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. లగచెర్ల గ్రామంలో డంపింగ్ యార్డు చెత్తాచెదారంతో నిండినా పట్టించుకోరు. ఆపైపుగా వెళ్తే దుర్వాసన వెదజల్లుతుందని చెబుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి డంపింగ్ యార్డులో చెత్తను ఎప్పటికప్పుడు తరలించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గౌరారంలో ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట రోడ్డు మధ్యలో నిలిచిన మురుగు



దుర్వాసన వెదజల్లుతున్న లగచెర్ల డంపింగ్ యార్డు

జిల్లా రోడ్లకు మహర్దశ

- రహదారుల విస్తరణకు రూ.220 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



మనోహర్‌రెడ్డి ఎమ్మెల్యే

తాండూరు: జిల్లా రహదారులకు మోక్షం లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు భారీగా నిధులు మంజూరు చేస్తూ.. శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్అండ్‌బీ రోడ్ల విస్తరణ, అభివృద్ధికి జీఓఆర్టీ నంబర్ 812లో రూ.119 కోట్లు, జీఓ నంబర్ 813లో రూ.101 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ పేర్కొన్నారు. జీఓ నంబర్ 112లో కోట్‌పల్లి, మర్పల్లి మండలాల రోడ్లకు రూ.42 కోట్లు, ఆలంపల్లి నుంచి రాళ్ల చిట్టంపల్లి డబుల్ రోడ్డు కోసం రూ.12 కోట్లు, బషీరాబాద్ నుంచి కరన్‌కోట్ రహదారి విస్తరణకు రూ.30 కోట్లు, మహబూబ్‌నగర్– చించోళి రోడ్డు మరమ్మతులు, వంతెనల పునరుద్ధరణకు రూ.35 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. తాండూరు– వికారాబాద్ ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం రూ.101 కోట్లను మంజూరు చేసింది. దీంతో తాండూరు నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రం వరకు 39 కిలో మీటర్ల రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. మొదటి విడతలో రూ.51 కోట్ల పనులు చేపట్టాలని సూచించింది.

మాట నిలబెట్టుకున్నా: ఎమ్మెల్యే

తాండూరు నుంచి వికారాబాద్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడతానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. మండల కేంద్రాల రోడ్లను విస్తరించడంతో పాటు బషీరాబాద్ నుంచి కరన్‌కోట్ రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఆర్అండ్‌బీ మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సాగుచేసిన పంటల పరిశీలన



ధారూరు: సుడిదోమను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అల్లాపూర్ శివారులోని పత్తి పంటను మండల వ్యవసాయశాఖ అధికారి కొమరయ్య పరిశీలించారు. శనివారం గ్రామ రైతు గోపాల్‌రెడ్డి పొలంలో సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. పొలంలో వర్షాపు నీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఎర్రగా మారిన పత్తికి టింట్ మందుతో పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: గాలిలో అధిక తేమ, ఉక్కపోత వాతావరణం వలన వరిలో సుడిదోమ వ్యాప్తి చెందుతుందని ధారూరు మండల పరిధిలోని నాగారం, గురుదోట్ల వ్యవసాయ విస్తరణ అధికారులు శిరీషా, సంజూరాథోడ్‌లు పేర్కొన్నారు. శనివారం వారు నాగారం గ్రామంలో వరికి సోకిన సుడిదోమను పరిశీలించి రైతులకు నివారణ పద్ధతులను సూచించారు. వరిలో సన్నగింజ రకాల్లో ఈ సుడిదోమ అధికంగా వ్యాపిస్తుందన్నారు. ప్రస్తుతం చివరి దశలో వరిలో సుడిదోమ ఉధృతిని తగ్గించడానికి ఎకరాకు 20 నుంచి 25 కిలోలు మాత్రమే వేసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు స్వీట్ల పంపిణీ



ధారూరు: మిఠాయిలు పంపిణీ చేసిన మార్వాడి యువమంచ్ నాయకులు

పెద్దేముల్: దీపావళి సమరహో సందర్భంగా ముందస్తుగా తాండూరు మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తామని ఆల్ ఇండియా మార్వాడి యువ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మనోహర్ సారడ పేర్కొన్నారు. మన్‌సాన్‌పల్లి, కొండాపూర్, మంబాపూర్, రుక్మాపూర్, రెగోండి ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడీ చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా స్వీట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అనిల్ సారడ, కార్యదర్శి సచిన్ రాఠి, సోషల్ వర్కర్ కేవీఎం వెంకట్, సభ్యులు పవన్‌సోని, పార్థాని, నిహర్ పోమని పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: ధారూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఆల్ ఇండియా మార్వాడి యువమంచ్ తాండూర్ శాఖ మిఠాయిలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా యువమంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్‌మోహన్ సారడా మాట్లాడారు.

వివాదాల్లో కరన్‌కోట్ పాఠశాల!

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఇటీవల వివాదంలో ఉంటుంది. ఎస్ఎంసీ తీర్మానం లేకుండా పాఠశాలలోని పాత పర్నిచర్‌ను అమ్మేశారని ఆరోపణలు ఉన్నాయి. అంతకు ముందు కూడా చెట్లను విక్రయించినట్లు ఎస్ఎంసీ దృష్టికి తెచ్చారు. ఈ విషయమై హెచ్ఎం, ఉపాధ్యాయుల మధ్య మనస్పర్ధలు వచ్చినట్లు సంబంధిత ఉపాధ్యాయులు తెలిపారు. తాజాగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆకతాయిలు ధ్వంసం చేశారన్నారు. గతంలో తాండూరు సబ్‌కలెక్టర్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంలో పాఠశాల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పాఠశాలలో నిత్యం వివాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

పట్టణ ప్రగతికి మాస్టర్ ప్లాన్



స్వప్నపరిమళ్‌తో మాట్లాడుతున్న రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి

- అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం
- మున్సిపల్ శాఖ టౌన్ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి

తాండూరు: మున్సిపాలిటీలలో మూడు దశాబ్దాల అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మున్సిపల్ శాఖ టౌన్ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ జిల్లాలో పర్యటించి తాండూరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, కమిషనర్ విక్రంసింహారెడ్డిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని స్వప్నపరిమళ్ డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులు కార్యాలయానికి సక్రమంగా హాజరుకావడం లేదని ఫిర్యాదు చేశారు. పట్టణ ప్రణాళికకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నర్సింహారెడ్డికి విన్నవించారు. తనకు వచ్చిన ఫిర్యాదుల మేరకే తాండూరుకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రెండు మున్సిపాలిటీల మాస్టర్‌ప్లాన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే వికారాబాద్ మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వికారాబాద్‌లో డిజిటల్ డ్రోన్ సర్వే కొనసాగుతోందన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి తాండూరు మున్సిపాలిటీలో డ్రోన్ ద్వారా సర్వే ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సత్యభామ, ప్రసీద, టౌన్ ప్లానింగ్ అధికారులు కరుణాకర్, పవన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారం అందించాలి

- మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత

చేవెళ్ల: దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పామెన మాజీ సర్పంచ్ డి.గోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో నిర్మిస్తున్న వీరభద్రస్వామి దేవాలయ అభివృద్ధికి శనివారం వెంకటసాయి డెవలపర్స్ ప్రతినిధి రూ.3లక్షల 16వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దేవాలయాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. దేవాలయాల నిర్మాణంలో ప్రతి ఒక్కరి సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, నాయకులు బుచ్చప్ప, వరుణ్‌రెడ్డి, వినోద్‌కుమార్, బాబు, రాములు, కొమురయ్య, రవికుమార్, అంజయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా కృషి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి



ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న నేతలు

దోమ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేందుకు దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ యాదవరెడ్డి, ప్రత్యేకాధికారి వెంకట్, మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షాహినాబేగం, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నేతలు అర్జున్ రెడ్డి, సత్యనారాయణ, సాహెబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆత్మీయ సభకు తరలిన గోపాలమిత్రలు



ఆత్మీయ సభకు తరలుతున్న గోపాలమిత్రలు

బొంరాస్‌పేట: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభకు నియోజకవర్గ పరిధిలోని గోపాలమిత్రలు శనివారం ఉదయం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ విధుల నిర్వహణలో కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తారనే ఆశాభావంతో ఆత్మీయసభను ఏర్పాటుచేసినట్లు గోపాల మిత్రలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,530 గోపాల మిత్రలను పశు సంవర్ధక శాఖలో విలీనం చేసి న్యాయం చేయాలన్నారు. అందుకు మంత్రి సైతం సానుకూలంగా స్పందించి ఉద్యోగ భద్రత కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 23ఏళ్లుగా నిర్విరామ సేవలతో, చాలీచాలని వేతనాలతో పశువైద్యసేవలు అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్ మండలాల పరిధిలోని 12మంది గోపాల మిత్రలు మహేశ్‌కుమార్, స్వయంప్రకాశ్, వెంకటేశ్‌గౌడ్, బాల్‌రాజ్, విశ్వనాథ్, శివకుమార్, వెంకటప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పత్తి, కంది సాగు

ఏడీఏ రుద్రమూర్తి



మాట్లాడుతున్న ఏడీఏ రుద్రమూర్తి

పెద్దేముల్: తాండూరు నియోజక వర్గంలో కంది, పత్తి సాగు పెరిగిందని తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి పేర్కొన్నారు. శనివారం రుక్మాపూర్, మంబాపూర్, పెద్దేముల్ గ్రామాల్లో పర్యటించి ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ–పాస్ ద్వారా రైతులకు పంపిణీ చేసిన ఎరువులు సక్రమంగా ఉన్నాయా? లేవా? అని పరిశీలించారు. రుక్మాపూర్ గ్రామంలో సీబీ పాస్ బుకింగ్ సర్వే చేశారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాండూరు నియోజక వర్గంలో కంది, పత్తి సాగు పెరిగాయన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయాలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రస్పిల్ గడ్డి మందును అనుమతి లేకుండా విక్రయాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పవన్‌ప్రీతమ్, ఏఈఓలు వినయ్, స్వాతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



విద్యార్థుల తల్లిదండ్రులతో గోపాల్

మండల విద్యాధికారి గోపాల్

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. శనివారం మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇంటి వాతావరణం అనుకూలంగా ఉండేట్టు చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి రోజు పాఠశాలలో బోధించే విషయాలను చదువుకునే విధంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిత్యం పిల్లల ప్రవర్తనను పరిశీలించి పాఠశాలలో సూచించిన ఇంటి పనిని సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా? అనే విషయాలు పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మండల కమిటీ ఎన్నిక

దౌల్తాబాద్: దళిత బహుజన మండల శ్రామిక యూనియన్ కమిటీని శనివారం జిల్లా ప్రధానకార్యదర్శి లింగంసాయిలు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందారం రాయప్ప, ఉపాధ్యక్షుడిగా గోవిందు, కార్యదర్శిగా అనంతయ్య, ప్రధాన కార్యదర్శిగా సాయమ్మ, కోశాధికారిగా మొగులప్ప తదితరులు ఎన్నుకోబడ్డారు.

• డ్రోన్లతో పిచికారీ

దుద్యాల్: పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలంటే గతంలో చేతిపంపు మందుడబ్బ సహాయంతో చేసేవారు. ప్రస్తుతం కొందరు రైతులు డ్రోన్లతో క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. దుద్యాల్ గ్రామానికి చెందిన మాసుల చిన్న సాయన్న శనివారం తన పొలంలో డ్రోన్ సహాయంతో కంది పంటకు పిచికారీ చేశాడు. వ్యవసాయానికి అధునాతన టెక్నాలజీ వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

• నేడు నిధుల విడుదలకు ఆందోళన

దోమ: రైతుభరోసా నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం చేపట్టనున్న రైతుభరోసా నిధుల విడుదల అంశంపై అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని చెప్పారన్నారు. ఈ సందర్భంగా దోమ మండల కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

• రాములు కుటుంబానికి అండగా ఉంటా

కుల్కచర్ల: జర్నలిస్ట్ రాములు కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆర్బీఎల్ కంపెనీ సీఈఓ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రాములు రెండురోజుల క్రితం మృతి చెందారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులను శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, నర్సింలు, లక్ష్మయ్య, రాంచంద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• ఆర్థిక సాయం అందజేత

తాండూరు రూరల్: మండల పరిధిలోని బిజ్వార్ గ్రామానికి చెందిన కట్ట వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ మృతుని కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

• అధికారులు పొలాలకు వెళ్లండి

తాండూరు రూరల్: వ్యవసాయశాఖ ఏఓ, ఏఈఓలు పొలాలకు వెళ్లాలని వ్యవసాయ శాఖ తాండూరు డివిజన్ ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతుబీమా పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు.

• సీఎం రుణం తీర్చుకోలేనిది

బొంరాస్‌పేట: పన్నెండేళ్లుగా తమ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సరిపడ ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడ్డారని, ఇటీవల ఐదుగురిని నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదని రేగడిమైలారం కాంగ్రెస్ అధ్యక్షుడు కుమ్మరి గుండప్ప పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.